**జీవితం పరుగు పందెంలో పాల్గొంటున్న చదువుకున్న నిరుద్యోగ పర్వం.**

"రేస్ బుక్స్.... రేస్ బుక్స్.... రేస్...." గోలగా అరుస్తున్నాడు రాజు.

"దక్కన్ టర్ఫ్, సౌత్ ఇండియా, ఒరిజినల్ వెల్, రేస్ న్యూస్, లక్కీ రేస్, రేస్ బుక్స్".... ఓ చేత్తో పేకముక్కల్లా రేస్ బుక్సనీ కాగితాల్ని పేర్చి ఎత్తి పట్టుకుని, మరో సంచి నిండా అలాంటివే మోస్తూ గబగబా అరుస్తున్నాడు.

ఆ రోజు శనివారం

పైగా దక్కన్ డర్బీ! ! !

మలక్‌పేట రైల్వే స్టేషన్‌నుంచి రేస్‌క్లబ్‌దాకా రోడ్డంతా రేస్‌బుక్స్ అమ్మేవాళ్ళ అరుపుల్తోనూ. పంటర్స్‌తోనూ. అశ్వమేధయాగాన్ని క్రమం తప్పకుండా సీజనంతా చేసే రేసింగ్ రాయుళ్ళతోనూ కోలాహలంగా వుంది.

మిట్టమధ్యాహ్నం-పన్నెండు దాటింది. ఎండ— వేటగాళ్ళ గుండెలో గుర్రాల మీది బెట్టింగ్సపై కోరికలామండిపోతోంది.

గాలి— డబ్బుల్లేవు— టికెట్టెలా కొనాలి అనే దోలాయమాన స్థితిలోంచి "ఈ జాక్‌పాట్ నీదే కొట్టు గురూ" అన్నట్టు ఆశల్ని సెగల్లా ఝుమ్మనిపిస్తోంది.

కారిపోతూన్న చెమటనికూడా లెక్క చెయ్యకుండా చకచకా ఆటోదిగినవాళ్ళ దగ్గరకి వరిగెత్తి మాటల్తో మస్కా కొట్టి ఆశలకి ఆజ్యంపోసి డజన్లకొద్ది అమ్మేస్తున్నాడు రాజు.

నెసిసిటీ. సోర్స్‌వైపు డ్రైవ్‌చేస్తే పుస్తకాల బరువెత్తి రూపాయలుగా మార్చి దించేసుకుంటున్నారు కుర్రాళ్ళు.

ఫాంటసీలు డ్రైవ్‌చేస్తే గాంబ్లింగ్ కోసం రేసుకొచ్చి ఉన్న బరువుని మరీ దించేసుకుంటున్నారు పంటర్లు. అందరి మధ్యా రాజు బొంగరంలా గింగిరాలు తిరుగుతున్నాడు. చేతిలో యింకా వందకి పైగా పుస్తకాలున్నాయి. మరో గంటలో యివన్నీ అమ్ముడు పోవాలి. ప్రతి పుస్తకానికీ పదిపైసల కమీషన్ తనకి.

డర్బీ రోజు కనీసం యివాళ ఓ పాతిక రూపాయలన్నాసంపాదించాలి ఎలా-ఎలా.

ఒక్కక్షణం నిలబడి దూరంగా వస్తూన్న నీలిరంగు అంబాసిడర్ కారుని చూశాడు.

కారు ఆగీ ఆగకముందే పదిమంది చుట్టూ చేరారు. లోపల్నుంచి ఖరీదైన సూట్‌లో వున్న ఓ యువకుడూ ఆ వెనకాలే అతి నాజూగ్గా మాక్సీలోఉన్న ఇద్దరు సుంగరాంగులూ దిగారు.

రాజు మెరుపులా ముందుకు దూసుకెళ్ళాడు.

"మేడమ్ కమాన్. యూ షుడ్ విన్ ది కేరీడోవర్ జాక్‌పాట్ అండ్ డర్బీ.... కమాన్ హేవె బుక్ టు గైడ్‌యూ...." అవతలవాళ్ళని మాట్లాడనీయకుండా గళాల్న బుక్సని ఒకామె చేతికి ఇవ్వబోయినవాడల్లా షాక్ తిన్నట్టు ఆగిపోయాడు.

ఎర్రగా. పొట్టిగా. నాజూగ్గా వున్న ఆ యువతి ఆశ్చర్యంగా చూసింది "ఓహ్ రాజూ.. యూ ఆర్ హియర్. సెల్లింగ్ దీజ్ ఓహ్...."

ఆమె మాట పూర్తికాకముందే పక్కనున్న సూట్‌వాలా విసుగ్గా ముఖంపెట్టి "వాట్ డియర్....వై డూ యూ వేస్ట్ అవర్ టైం....టాకింగ్ విత్ సచ్ రోడ్ సైడ్ బగ్గర్స్....కమాన్..ద రేసిజ్ ఎక్స్‌పెక్టెడ్ టు స్టార్ట్...." అంటూ గేట్‌వైపు దారి తీశాడు.

క్షణంపాటు సందిగ్ధంగా చూసి చటుక్కున హాండ్‌బాగ్‌లోంచి విజిటింగ్‌కార్డు తీసి రాజు షర్ట్ జేబులోకితోసి "మీట్ మి ఇన్ది యూ ఈవెనింగ్ బై సిక్స్" అనేసి వరుగులాంటి నడకతో మెంబర్స్ గేటువైపు వెళ్ళిపోయింది.

అతి నిగ్రహంమీద వణుకు నాపుకుంటూ కాళ్ళీడ్చుకుంటూ పక్కనున్న సోడాబండీ దగ్గరకెళ్ళి సోడా తాగాడు సోడా రాములు కన్నుగీటి "ఏం గురూ. కార్లో పిట్టలుకూడా ఎరకేటీ....". కిసుక్కుమన్నాడు. ఉరిమేలా ఓ చూపు. ఇరవై పైసలూ విసిరి రేస్‌బుక్స్ సంచీని ఎడమ చేతిలోకి మార్చుకుని జేబులోంచి కార్డు తీశాడు.... వణుకు.... కార్డ్ తీస్తూంటే నరనరాలూ వద్దని మొరాయించాయి. గళాల్నతీసి చించేయబోయి ఆగిచూశాడు.

సుజాత ఎం.ఏ. ఆ తర్వాత అక్షరాలు అలుక్కుపోయినట్టు....

కన్నీటి తెరని బలవంతాన తొలగించేసుకుని మళ్ళీ రేస్ బుక్స్ అమ్మకం సాగించాడు. ఈసారి తన గొంతు తనకే జీరగా వినిపిస్తోంది.

"రేస్....బుక్స్....కమాన్ సార్.... హర్రీ అప్....ట్రై యువర్ లక్...." అంటూ ఆగిపోయాడు.

ఎవరో ఆంగ్లో-ఇండియన్ రెండు బుక్స్ కొని మెళ్ళోంచి కెమెరా తీసి "మే ఐ టేక్ ఎ స్నాప్ జంటిల్‌మన్.... అయాం ఎ రిపోర్టర్ ఆఫ్ ఎ లీడింగ్ మ్యాగజైన్ ఇన్ బాంబే" అంటూనే తన పని చేసేసుకున్నాడు.

"యు ఆర్ ఎ...."

"గ్రాడ్యుయేట్...." రాజు తలొంచుకుని చెప్పాడు.

"ఈజిట్! ...."

నిరుద్యోగ సమస్యమీద ఆయనో ఫీచర్ తయారు చేస్తున్నాట్ట....రాజు నవ్వుకున్నాడు.

బెల్ రింగవడంతో అంతా లోపలికి దౌడుతీశారు.

రాజు గేటుదగ్గర గోడ కానుకుని చెమట తుడుచుకున్నాడు. జేబులోంచి చిల్లరా. నోట్లూ తీసి లెక్కపెట్టాడు. ఫర్వాలేదు.... నూటయాభై మూడు రూపాయలు.... అంటే తను కనీసం పదిహేను రూపాయలు సంపాదించాడు.

లోపల అనౌన్స్‌మెంట్ అవంగానే ఫస్ట్‌రేస్ మొదలైంది.... కమాన్.... హర్రీ.... అరుపుల్తో గ్రౌండ్ దద్దరిల్లిపోతోంది.

సరిగ్గా అరగంట తర్వాత జాక్‌పాట్ రేసెస్.... వన్.... టూ.... త్రీ.... ఫర్స్ట్ లెగ్.... డర్బీ.... డర్బీ....

అంతా ఉత్సుకతతో చూస్తున్నారు. రేస్ స్టార్టయ్యేందుకింకా పదినిముషాలే టైం ఉంది.... భరించలేని టెన్షన్....

యజ్ఞకాండలో హోమబలికి సమిధల్లా



# ది రేస్

అక్కపెద్ది వెంకటేశ్వరశర్మ

అన్నీ వినిపిస్తున్నా కనిపిస్తున్నా దూరంగా సైకిల్‌స్టాండు దగ్గర ఓ చెట్టు క్రింద నిస్సత్తువుగా కూలబడి వున్నాడు రాజు.

అరగంటలో రేస్ కోర్సంతా దాదాపు నిర్మానుష్యంగా అయిపోయింది. పోలీసులు వచ్చి లాఠీఛార్జ్ చేయడంతో పరిస్థితి శాంతించింది.... రేస్ కాన్సిలైంది.

కడుపులో ఆకలి.... బుద్ధిలేక జేబులో పైసలన్నీ సంచీలో పోశాడు.... ఛీ.... జేబులు తడిమి చూశాడు.... వెనక జేబులోంచి రూపాయలు టికెట్లుగా రూపాంతరం చెందుతున్నయ్.

గగన తలాన్నుంచి చోద్యంగా మరింత దగ్గిరగావస్తూ చూస్తున్నాడు నడినెత్తినున్న సూరీడు.

సంచీలోని డబ్బులన్నీ కర్చీఫ్‌లో చుట్టబెట్టి మళ్ళీ సంచీలో పడేసి గేట్ దగ్గర నిలబడి చూస్తున్న రాజు ఉన్నట్టుండి కెవ్వుమన్నాడు.... "పకడో.... చోర్.... మారో. చోర్.... పకడో.... చోర్.... చోర్"

రాజు చేతిలో సంచీని ఒడుపుగా లాగేసి ఎవడో స్కూటర్‌వాలా రివ్వున బాణంలా దూసుకుపోయాడు.

జనం గుంపుగా రోడ్డునపడి పరిగెట్టారు.

"క్యా భాయ్.... కిత్‌నే పైసే.... ఎలా పోయినయ్.... అంత చూసుకోలేదా.... దేఖో జమానా.... యియ్యాళ్రేపు అమీర్‌కి గరీబ్‌నై.... గరీబ్‌కో అమీర్ లూట్‌నే లగా" — రకరకాల వ్యాఖ్యానాలు....

కనీసం స్కూటర్‌కి నెంబరు కూడా లేదు.

ఎక్కడని వెతకాలి? ఏం చేయాలి? ఎవరికి చెప్పాలి? రాజుకి మూర్ఛ వచ్చినంత పనైంది. కళ్ళంబడి నీళ్ళు సుళ్ళు తిరిగినయ్.

ఐదు నిమిషాల్లో అంతా మళ్ళీ ఎవరి పనుల్లో వాళ్ళు పడిపోయారు..... ఖాళీ చేతుల్తో, కాలే కడుపుతో కళ్ళనిండా నీళ్ళతో నిస్సత్తువుగా కాళ్ళీడ్చుకుంటూ నడక సాగించాడు.

రేస్ కోర్సంతా ఉన్నట్టుండి చప్పుళ్ళు, కుర్చీలు.... బెంచీలు.... ధబధబలాడి పోతున్నాయన్నీ. జనం గొర్రెల మందల్లా బయటకు తోసుకొస్తున్నారు.... భయం.... అరుపులు.

మోసం.... దగా.... కూప్.... కూప్.... అరుస్తున్నారెవరెవరో.... ఏవేవో గొంతులు.... శబ్దాలు.... ఫెళఫెళా చప్పుళ్ళు.... ఆడామగా.... ఒకళ్ళ మీదొకళ్ళు పడిపోతూ.... అరుపులు.... రణగొణధ్వని.. ఏమైంది... ఏమైందేమైంది.. క్యాహువా?.. ఎవరి ప్రశ్నకీ జవాబులేదు.. ఆటోలు స్టార్టయి పోతున్నయ్.... స్కూటర్లు బర్రుమంటున్నయ్.... కార్లు కంగారెత్తి పరిగెడ్తున్నయ్.... మారో సాలోంకో.... పైసే వాపస్‌కరో.... కూప్.... కూప్.... రేస్ కేన్సిల్.... అనౌన్స్‌మెంటు.... అరుపులు.

సరీగ్గా ఐదుపైసల బిళ్ళ—ఒంటి పక్షిలా మిగిలింది.... ఐదు పైసలకి.... ఏమొస్తుంది చాయ్ రాదు.... సమోసా రాదు.... పిప్పరమెంట్—నవ్వుకున్నాడు.


దూరంగా రేస్ కోర్స్.... కుక్కలు చింపిన విస్తరిలా పడుంది....

రాబందులు పీక్కుతిన్న శవఖండాల్లా టిక్కెట్లు ముక్కలై ఆవరణంతా నిండిపోయాయి. వీటన్నిటినీ లెక్కపెడ్తే ఎన్ని రూపాయలవుతాయి.... ఈ చిరిగిన ముక్కల్లో ఎన్ని చెదరిన సంసారాలున్నాయి.

—ఆకలి మండుతుంటే ఆలోచన్ల జూలు విదిల్చిలేచి ఎదురుగా బడ్డీకొట్టువాణ్ని బతిమాలి కాసిన్ని నీళ్ళు తాగాడు.

ఎత్తులోంచి పల్లంలోకి సాగిపోతూన్న ఆ రోడ్డుమీద నడుస్తూన్న రాజు నీరసంగా నవ్వుకున్నాడు.... ఈ రేస్‌కోర్స్ దారి ఎంత బాగుంది! డౌన్‌నుంచి అప్పర్ సైడ్.... ఆశలతో వెళ్ళే మనిషిలా.... క్లబ్ వైపు.... ఈ అప్ అండ్ డౌన్స్‌ని తను ఎన్నిసార్లు వింతగా చూశాడు!

జేబు ఖాళీ అయిన పంటర్ల గుండెల్లా వెనక్కి తిరిగితే మళ్ళీ పల్లంలోకి.... ఎన్నిసార్లు చూశాడు.... కానీ జీవితంలో ఎప్పుడూ.... ప్రతిసారీ తను డౌన్ సైడే మొగ్గుతున్నాడు.... యిప్పుడూ నూ!




రైల్వే బ్రిడ్జిదాటి గబగబా కోటీవైపు తిరిగాడు. ఇవాళ కడుపు ఖాళీ—అమ్మ కేమని చెప్పాలి?-తను తెస్తే రేపటికి పొయ్యి లేస్తుందంది....లేకపోతే....లేక పోవడం ఇవాళే మొదలు కాదు..చెల్లాయ్.. చెల్లాయ్ ఏమంటుంది....దాని కాలేజీ ఫీజ్ కట్టలేదు....తప్పదు....పరీక్షలముందు దాని చదువాగి పోతుందా....

విమెన్స్ కాలేజీ దగ్గర చమన్‌లో కాస్సేపు కూర్చున్నాడు....అలసట.... నీరసం....ఒళ్ళు తూలుతోంది....పేగులు ఆవురావురు మంటున్నాయ్....ఏంచేయాలి? యస్....ఎదురుగా యాపిల్ పళ్ళబండీమీద పడి నాలుగు లాక్కుపోతే....తే.... లేదా ఓ హోటల్లోదూరి పీకదాకా మెక్కేసి బిల్ చెల్లించకుండా చెక్కేస్తే....స్తే....యస్.. కరెక్ట్.... ఆ సిల్క్ లాల్చీవాలా దగ్గిర బోలెడు డబ్బుంటుంది .... దోచేస్తే.... యస్.... కమాన్....క్విక్.... హర్రీఅప్. డూ....ఆత్మలేదు....మనసులేదు...మొరాలిటీమీద రియాలిటీ విప్లవం .... కాంట్రడిక్షన్ల ముళ్ళు విప్పేస్తే .... ఫాంటసీల్ని పగటికలలు చేసేసే....యస్....కమాన్. ఎవరో ముగ్గురమ్మాయిలు పేవ్‌మెంట్ మీంచి పోతున్నారు .... ఓహ్....దీ న్తస్సదియ్య .... ఏం రంజుగుంది.. జయప్రద జూనియర్‌లాగుంది.... యస్....కమాన్.. దాన్నోసారి....దాన్నసేంటి .. దీన్నసేంటి. దేన్నయితేనేంటీ .... కమాన్ .... లాగించేస్తే....

ఛీ....ఎమిటాలోచన్లిలా సుళ్ళు తిరుగుతున్నాయి....ఏం చేయాలి....కరెక్ట్....ఈ దేశంలో విప్లవం రాదు....ఇది పిల్లల్ని కంటూ—తింటూ బ్రతికే బానిసదేశం... ఆహా....అయిపోతాడు .... వన్ ఫైన్ మార్నింగ్ తనూ ఓ రివొల్యూషనిస్ట్ ఐపోతాడు....ట్యూబ్‌లైట్‌లా వెల్గిపోతాడు.... జాబ్ లేకుండా యెన్నాళ్ళో వుండలేడింకా.. యస్ .... మూడేళ్ళు గడిచినయ్....తనకింకా ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజీనించి కాల్స్‌కూడా రావడంలేదు....తనకు పుష్ లేదు....కమాన్....ఏదో చేసెయ్....ఎదురుగా....జస్ట్ అప్ టూ దిస్ ప్లేస్...బానర్.. "ఇదిగో ఇక్కడిదాకా...." యస్.... మూవీస్....ఇక్కడిదాకా....పతనానికి పరాకాష్ఠ దాకా....సంస్కృతికి సమాధిదాకా... ఆడదాని చీరలో లోపలిదాకా....యసెస్... తీస్తాడు ....తనూ ఓ ఫైన్ మార్నింగ్ న్యూడ్ లాగేసి సినిమా తీసేసి లక్షలు సంపాదిస్తాడు—

బట్....ముందు తన కడుపులో ఆకలి ఎవడు తీరుస్తాడు?....ఈ కాలే నరాల గోడెవడు వింటాడు?

విజిటింగ్ కార్డ్ మరోసారి తీశాడు.... ఆరింటికి....సుజాత....తొలిసారి తన ఊహల్ని కాల్చేసి. నరాల్ని మండించి తననో పెర్వర్ట్‌నిచేసేసి. ఫారిన్ రిటర్న్డ్ బావగాణ్ణి చేసుకున్న సుజాత!

టైం చూశాడు....నాలుగు దాటింది.... ఏంచేయాలి.... ఏం మిగిలింది....?

హనుమాన్ టేకిడీలోఉన్న యింటివైపు కదిలాడు....చెల్లాయ్ ఒక్కతేఉంది.... అమ్మ ఎవరింట్లోనో బియ్యం చేయడానికి వెళ్ళిందిట .... అమ్మ....అమ్మ.... బియ్యంచేసి రెండ్రూపాయలు సంపాదిస్తుంది....అదే రేపటికి గంజి....అంతే. చదివి ఉద్ధరిస్తాడనుకున్న తను .... తనేం చేశాడావిడకి....ఏం చేయగలిగాడు?

తలుపుతోసి లోపలికి వెళ్ళాడు. నులక మంచంమీద పడుకొని ఏదో పుస్తకం చదువుతూన్న చెల్లాయ్ ఆ బుక్‌ని దిండు కింద గభాల్న తోసేసింది. గమనించనట్టే మంచినీళ్ళిమ్మన్నాడు. అది లోపలికి వెళ్ళగానే దిండెత్తి చూశాడు.

"రాత్రికి వస్తావా?"

చెంప ఛెళ్ళుమన్నట్టు ఉలిక్కిపడ్డాడు.. ఇరవై నిండని సునీతికూడా....నాన్సెన్స్.. కోరికలకిరవై యేంటరవయ్యేంటి..లాభం లేదు....దీనికి పెళ్ళి చెయ్యాలి త్వరగా.... వెంటనే....చెడిపోకముందే!

నీళ్ళుతాగి కాజువల్‌గానే బయటకు వచ్చేశాడు. రోడ్డుమీద మునిసిపాలిటీవాళ్ళ బోర్డు...."మనది అందమైన నగరం—నందనవనం చేద్దాం...." నవ్వుకున్నాడు.. మరోవాక్యాన్ని జతచేయడం మర్చిపోయిన ఆర్టిస్టుని తలుచుకుని.... "మనది కుళ్ళిపోయిన సమాజం....దీన్ని శిథిలంచేద్దాం" అని రాయనందుకు!

* * *

పగటి వెలుగును చీల్చేస్తూ చీకటికమ్మే వేళ....

ఆరౌతోంది—

బంజారాహిల్స్‌మీదకి కాళ్ళీడ్చుకుంటూ ఎక్కుతున్నాడు రాజు. అసలెందుకింత దూరం వస్తున్నట్టు.... ఎందుకు....సుజా.. తన ప్రేమరాణి.... గడచినకాలంలో.... తొలి మధురిమ.... యిప్పుడో డాక్టర్‌గాడి పెళ్లాం.... నలిగినపువ్వు.. ఇంకా ఎందుకీ భ్రాంతి.... వెర్రి వెంపరాట.

మెటీరియలిజానికి, సెంటిమెంటలిజా

ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలనైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండిపోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.

Address

GAUTAM CHIKITSALAYA (S-DD)
(P.O.) KATRI SARAI (GAYA)

వికీ మధ్య ట్రాన్స్.... గుండె అట్టడుగు నుంచి వైబ్రేషన్స్.... ఉనికిని నిరూపించుకునేందుకు మనిషి—అస్తిత్వంకోసం నిరంతరం చేసే సంఘర్షణలో—ఊహకీ—వాస్తవానికీ, చావుకీ — బ్రతుక్కీ పొలిమేరల మధ్య....దూరంగా ఏదో యింకా మిగిలుందనే యిల్యూజన్ .... ఇంకా యెందుకు?

ఒక్కసారి కాలేజ్ డేస్ గుర్తుకొచ్చినయ్....వాట లైఫ్—మాసిన గడ్డాన్నీ నలిగిన పాత దుస్తుల్నీ చూసుకున్నాడు.... హౌ....ఎలా వెళ్ళాలి .... యిలా ఎలా యిలా ఎలా వెళ్ళటం....ఎలా చూడటం.. రానిస్తుందా.... ఎలా.... ఎందుకు.... ఎందుకు.... సుజా.... యూనివర్శిటీ కాలేజీలో తనూ సుజా ఎన్నిసార్లు కలుసుకున్నారు....ఎన్నికలలు....ఎన్నిఊహలు. డిగ్రీ అయిపోయాక సుజా ఫారిన్ చెక్కేసింది.... అక్కడే డాక్టర్ బావగాణ్ణి చేసుకుని తనకీ తన ప్రేమకీ శాశ్వతంగా గుడ్‌బై కొట్టేసింది.

ఇంకా ఎందుకు వెళ్ళడం?.... వెళ్ళి ఏమని అడుగుతాడు.... కానీ వెళ్ళాలి.... ఎందుకు.... అన్నీ ప్రశ్నలే.... జవాబుల్లేవు.... అన్నీ సమస్యలే— విడని చిక్కుముళ్ళు.... జ్ఞాపకాల్లో అల్లుకుపోయిన అస్పష్టత.... గుండెల్లో ఎక్కడ్నించో లోలోపల్నుంచి ట్రాన్స్.

డాక్టర్ దివాకర్—లెక్చరర్ సుజాత—

నేమ్‌ప్లేట్ చూశాడు. గేటుదాటి అడుగు పెట్టాంటే అల్సేషియన్ కుక్క భౌమంది... మొదలు....ఈ గేటే ఈ అంతరాలకి నాంది....ఈ కుక్కే ఈ అంతస్థులకి కాపలాదారు.

తనకీ బాల్కనీలో నిల్చున్న సుజాకీ మధ్య దూరమెంత?

స్లీవ్‌లెస్ బ్లౌజ్....లైట్‌గ్రీన్ శారీ.... అదే నాజూకుదనం.... అదే ఎన్‌ఛాంటింగ్ బ్యూటీ....కొద్దిగా ఒళ్ళుచేసి ఇంకా బాగుంది.

ఒక్కసారి తన అరిగిపోయిన చెప్పుల్నీ డ్రస్సునీ చూసుకున్నాడు.

రమ్మన్నట్లు చేయూపింది గాల్లో.

మెల్లిగా మెట్లెక్కి పైకి వెళ్ళాడు.

బాల్కనీలో చైర్స్ వేసి ఉన్నయ్....

"కమాన్ రాజా...."

వెళ్ళడానికే బిడియపడ్డాడు. ఏమీ జరగనట్టే ఓ జస్ట్ కాలేజ్‌మేట్‌ని పిలిచినట్టు ఎలా ఇన్వయిట్ చేస్తోంది?

వెళ్ళి కూర్చున్నాడు.

మెళ్ళో చైన్‌ని షోగ్గా ఊపుతూ వెనక్కివాలి కాళ్ళాడిస్తోంది.

KANTA CHAP

రంజాన్ పండుగ సందర్భంలో 'బొంబే డైయింగ్ వారి' పోలిస్టరు సూటింగ్స్, షర్టింగ్స్, శారీస్, డ్రెస్ మెటీరియల్స్, మీ కుటుంబానికి సరిపడు పలురకాల వస్త్రములు ఖరీదుచేసి బిల్లు అమౌంటుపై నిర్ణయించిన స్టీలు బహుమతులు పొందండి.

బొంబే డయింగ్ షోరూం

శ్రీ లక్ష్మి, కొత్తగూడెం.

100% "పాస్ గ్యారంటీ"

ఫెయిలు అయినచో ఫీజు వాపసు

పోస్టల్ కోచింగ్ ద్వారా ఏ విద్యార్హత లేకున్నను, డైరెక్టుగా బి. ఏ., బి.కాం., (ఆంధ్రా యూనివర్శిటీ) పాస్ కావచ్చును.

ప్రాస్పెక్టసు కొరకు రు. 3/- యం. ఓ. చేయండి.

Principal, Vijaya Tutorial College, GUDUR, Nellore Dt. (A.P.)

Branch : Vijaya Tutorial College, 14/27 A, Kamala Nagar, ANANTAPUR-515 001.

నాణ్యతలో తిరుగులేనివి ఆంకర్ సాక్స్

స్కూలు యూనిఫారం సాక్స్ కావలసిన రంగులలో



అన్ని పెద్ద దుకాణాలలో లభిస్తాయి

డిస్ట్రిబ్యూటర్లు : లాల్వాని బ్రదర్స్

13 గోయల్ మార్కెట్, సిద్దియంబర్ బజార్, హైద్రాబాద్ ఫోన్ : 58184

గాథావళి :

## మా ఇల్లెక్కడో చెప్పండి

ప్రిన్స్‌టన్‌లో ఉన్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డు స్టడీస్ అనే సంస్థకు అల్బర్ట్ ఐన్‌స్టీన్ అధికారిగా పనిచేశారు. ఒకరోజు ఆయన కార్యాలయంలో టెలిఫోన్ మోగింది. ఐన్‌స్టీన్ లేనందున ఆయన కార్యదర్శిని ఫోన్ ఎత్తగా ఎవరో ఐన్‌స్టీన్ వున్నారా అని అడిగారు. లేరని జవాబు చెప్పినా కూడా విడవక ఆ కంఠం, ఆయన ఎక్కడ నివసిస్తారో చెప్పమని ప్రాధేయపడింది. అప్పుడు కార్యదర్శిని అలా చెప్పడానికి వీలుకాదని. ఐన్‌స్టీన్ తన ఏకాంతాన్ని ఎవరూ భంగపరచడాన్ని ఇష్టపడరనీ చెప్పింది. వెంటనే ఆ మనిషి రహస్యం చెబుతున్నట్టుగా గొంతు తగ్గించి అన్నాడు. "దయచేసి ఎవరికీ చెప్పకండి. నేనే డాక్టర్ ఐన్‌స్టీన్‌ను. నేను ఇంటికి వెళ్ళే ప్రయత్నంలోనే వున్నానుగాని మా ఇల్లెక్కడో మరిచిపోయాను."

—ఆర్. శ్యామల

సుజాపక్కనే తెల్లని సీమకుక్కొకటి లయగా తోకాడిస్తోంది.

"ఊ....అయితే నేవిన్నది నిజమేనన్న మాట...."

"ఏంటి?"—తలెత్తాడు.

"నీకు ఇంకా జాబ్ దొరకలేదని...." శవాన్ని నీ ప్రాణం పోయిందా అని అడిగినట్టుందా ప్రశ్న.

తలొంచుకున్నాడు. నిముషం తర్వాత కూడబలుక్కుని లోలోపలే నాలుగుసార్లు రిహార్సల్ వేసుకున్నాడు. "ఎందుకు పిలిచావ్?"

"ఎందుకు వచ్చావ్?" ఎదురుప్రశ్న వేసింది.

ఇంతలో పనివాడు కాబోలు ట్రేలో టీ తెచ్చాడు.

తాగుతూ "మా వారితో చెప్పి నీకో ప్రైవేటు కంపెనీలో జాబ్ యిప్పిస్తాను.. మంచి జీతం యిస్తారు....నీ బాధలు ఎన్నాళ్ళో ఉండవింక.." అంది. బహుశః అది భర్త పలుకుబడిని తల్చుకున్న గర్వం కాబోలు అన్పించింది.

"అందుకేనా పిలిచావ్?"

"మరి.." చిత్రంగా భుజాలెగరేసింది.

బుద్ధిలేక అడిగినందుకు తగినశాస్తి జరిగిందనుకున్నాడు. నిముషంపాటు ఆమె కళ్ళలో దేనికోసమో వెతికాడు.. ఏదీలేదు. ఆమెలో గతంతాలూకు ఏమిలేదు.. ఏవీలేవు!

"వచ్చే బుధవారం కలుస్తావా? ఓ మీటింగ్‌లో వారు.."

చటుక్కున లేచి నిలబడ్డాడు.

ఓ అడుగు ముందుకేసి "థాంక్స్.... థాంక్యూ వెరీమచ్....బట్ ఐ డోంట్ డిజర్వ్ ఎనీ జాబ్ త్రూ యువర్ ఆనరబుల్ హజ్బెండ్....ఐ జస్ట్ కేమ్ హియర్ టు వెరిఫై వెదర్ సుజా ఈజ్ ఎలైవ్ ఆర్ నాట్....బట్ .... సుజా ఈజ్ నో మోర్...షీ ఈజ్ డెడ్...ఓన్లీసుజాత-మిసెస్ దివాకర్ ఈజ్ ఎలైవ్...." అనేసి గబగబా పెద్ద పెద్ద అంగల్తో బయట కొచ్చేశాడు.

వెనకాల సుజాత గుండెలో చిప్పిలిన నీళ్ళసంగతి రాజుకేకాదు. యెవ్వరికీ తెలీదు—పుట్టించిన దేవుడికూ్కడా!

సుజాత ఈ దేశపు ఆడపిల్ల!—అంతే!!

* * *

నగరాన్ని గాఢంగా కౌగలించుకున్న నిశీధి....అక్కడక్కడా మినుకుమనే గుడ్డి దీపాలు....పొడుగ్గా వెనగ్గా పెరిగిపోయే నీడలు!

రాజు వంటరిగా నడుస్తున్నాడు..ఎంత రాత్రయిందో తెలీదు..నగరం నిశ్శబ్దంగా నిద్రలో జోగుతూంటే ఈ నిశిరాత్రికి కాపలాగా తను!

చలిగాలి రివ్వుమంటోంది.

పాన్ షాప్‌లో సిగిరెట్టిమ్మని ఐదు పైసల బిళ్ళ యిచ్చాడు.

"ఇంకో పైసా కావాలి...."

పైసా....ఏదీ....జేబులో పైసా కూడా లేదింక....లేదని వాడితో ఎలా చెప్పాలి..?

ఏమనుకున్నాడో ఏమో రెండు బీడీలు తీసిచ్చాడు కొట్టువాడు.

అక్కడే వెల్గించి మళ్ళీ రోడ్డున పడ్డాడు

దార్లో పబ్లిక్‌టాప్ దగ్గరకెళ్ళిచూశాడు.. దాంట్లో నీళ్ళురావు.. అది ఆకారం మాత్రమే..!

సెకండ్‌షో జనం ఎప్పుడో గూళ్ళకి చేరుకున్నారు.


కడుపులో ఆకలి. పేగులు కదిలిపోతున్నయ్.. పొగ.. కంపు.. బీడీపొగ గుప్పు గుప్పున వదిలాడు. ఆఖరిదమ్ము పీల్చి దూరంగా విసిరేశాడు బలంకొద్దీ కసిగా.


దీర్ఘంగా సాగిపోయిన మూడేళ్ళు!

బి.ఏ. చదివి తనెంత వుద్ధరిస్తాడో అనుకున్న అమ్మ తనని రోజూ తిట్టుకుంటూ వంటలక్కలా మారిపోయింది.

కనేసి దేశాలు పట్టిపోయిన తండ్రి తనకీ తెలీదు!

చెల్లాయిసంగతి .... ఎలానో కష్టపడి ఫీజుకట్టి చదివిస్తున్నాడు తన డిగ్రీ కూడుపెట్టక పోయినా చెల్లాయి అదృ






ష్టంతో టాస్ వేయడం .... ప్రపంచం 'లూనటిక్ ఏసెలం'లా కన్పిస్తూన్న క్షణాలు ఒంటరితనంలోనే..మళ్ళీ బెట్టింగ్.

జీవితంతో రేసింగ్..కానీ..కానీ అది "రాత్రికి వస్తావా" దార్లో పడిందని ఈ రోజే చూశాడు...తను ... తనేం చేస్తున్నాడు .... రేస్ బుక్స్....ఆ ఇంటర్వ్యూ తీసుకున్నాయన ఫీచర్‌లో తనూ తన ఫొటో వస్తాయ్ కాబోలు....బి ఏ పాసై రేస్ బుక్స్ అమ్మే రాజు....అంటూ.... అహ్హహ్హ .... ఈ మూలకంగానైనా తన పేరు పేపరు కెక్కుతుంది!

సాగర్ టాకీసు దాటి వచ్చాడు.

ఎవరో రేపటి రేస్ గురించి తీవ్రంగా ఓ లైట్‌పోల్ క్రింద గట్టుమీద కూర్చుని దీర్ఘంగా ఆర్గ్యూ చేసుకుంటున్నారు.

"ఇవాళలానే రేపూ అప్సెట్ వస్తే?" ఎవడో అంటున్నాడు.

అప్సెట్ .... రాజు నవ్వుకున్నాడు.. ఈ జీవితమే ఓ పేద్ద అప్సెట్.. రత్న గర్భలో కదలాడే సజీవశవాల్ని దాటుకుని ముందుకుసాగి యింటికి వచ్చేశాడు.. దరి దాపుల్లో కొచ్చేశాడు.

ఏంచేయాలి.. జాబ్ రాదు. వందరూపాయలకి క్లర్కు ఉద్యోగంకంటే ఈ రేస్ బుక్స్ ఉద్యోగమే నయం. దీనికన్నా బెటరేదీ.. సిగరెట్ లేకుంటే బీడీ.. బ్రతకలేకుంటే చావు. ఎదగలేని జీవితానికి ముగింపు..!

తల విదిల్చాడు.

చలిగాలి మండుతూన్నట్లనిపించింది.

పేగులు ఆర్తనాదాలు చేస్తున్నయ్.

దూరంగా యెక్కడో కుక్కలు భీకరంగా ఏడుస్తున్నయ్.

తలుపు తట్టబోయి ఆగాడు.

పెరటివైపు అలికిడైతే మెల్లిగా చప్పుడు చేయకుండా వంగి పొదల పక్కనుంచి చూశాడు.

ముఖం బ్రద్దలైనంత షాక్!

గుబురుగా పెరిగిన డిసెంబర్ పూల చెట్ల మధ్య ఆత్రంగా ఆవురావురుమంటూ కౌగలించేసుకుంటూన్న చెల్లెలూ, పక్కింటి సత్తిబాబూ!

చిన్నగా దగగానే గభాల్న చీర సర్దుకుని లోపలికి పరిగెత్తింది. అంతకుముందే సత్తిగాడు గోడదాటి పరారయ్యాడు. మరో ఐదు నిమిషాలు బొమ్మలా నిలబడిపోయి తలుపు తోసుకుని లోపలికెళ్ళాడు.

ఈతాకుల చాపమీద అలిసిపోయినట్లు ఒళ్ళెరగని నిద్రలో ఉంది అమ్మ.

చేసిన తప్పుకు ఏమంటాడోనని దొంగ నిద్ర నటిస్తోంది సునీతి.

వంటింట్లోకి వెళ్ళి గ్లాసెడు నీళ్ళుతాగి పాతమంచం మీద కూర్చున్నాడు. బుర్ర స్తబ్దుగా అయిపోయింది.

## జోకాభిరామాయణం

### అద్దరి మేలిద్దరి కీడున్‌గలవె!

ఒక దేశదిమ్మరిలా కనిపించే యువకుడు నదికి యీవలి తీరాన నిలబడి పడవ దాటించే మనిషిని "రేవు దాటించడానికి ఎంత?" అని అడిగాడు.

"పది పైసలు"



"మరి నా దగ్గర పదిపైసలు కూడా లేవే" అన్నాడు వూరికే దాటించమని అర్థం వచ్చేలా.

పడవవాడు ఆలోచిస్తూ—"పదిపైసలు లేనప్పుడు యివతల వుంటేఎంతో, అవతల వున్నా అంతే" నన్నాడు.

★

### స్పెల్లింగ్

మీ అబ్బాయి చేతిరాత ఎంత దరిద్రంగా వుందంటే మీ వాడికి స్పెల్లింగ్ వచ్చునో, రాదో తెలుసుకోవడం కష్టంగా వుంది.


★

### అశ్వఘోష

ఒక నడివయసు పెద్దమనిషి పిల్లలు సరదాగా పార్టీ చేసుకుంటున్న యింట్లోకి వెళ్ళి వాళ్ళని అద్భుతపరచాలనే ఉద్దేశంతో ఓ యింటికి వెళ్ళి—తన ప్రవేశాన్ని ముందుగా తెలియచేయవద్దని డ్రాయింగ్ రూమ్ తలుపు తోసుకుని మాటలు వినపడుతున్న వైపుకు—చేతుల్ని నేలమీద ఆన్చి గుర్రంలా సకిలిస్తూ యికిలిస్తూ పాకుతూ వెళ్ళాడు.

ఒక్కమాటంతా చచ్చేటంత నిశ్శబ్దం అయింది. ఈ గుర్రపు చేష్టలు చేస్తూ వెళ్ళిన ఆసామీ తలెత్తేసరికి తనవైపు ఆందోళనతో, గాబరాగా ఆరుగురు పెద్ద మనుషులు నివ్వెరపడి చూస్తున్నారు.

అప్పుడతనికి తెలిసింది తను రాంగ్ హౌస్ అంటే తప్పుడు కొంపలోకి చేరానని.



'గాయక సార్వభౌమ' శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య జయంత్యుత్సవాల సందర్భంగా విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో పాట కచేరి చేస్తున్న శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ బృందం

ఆంతరాంతరాల్లో నిశ్శబ్దపు జలపాతాల హోరు.

ఉన్నట్టుండి చెల్లాయి లేచివచ్చి సినిమాటిక్‌గా క్షమించమన్నట్టు కాళ్ళమీద చెయ్యి వేసింది.

పరీక్షగా చూశాడు..చెల్లాయి కాబట్టి తనే నాడూ యిలాపరీక్షగా నిశితంగా చూడలేదు. సునీతి ఇరవయ్యేళ్ళ యవ్వనంలో ఉంది!

జాలిగా నిట్టూర్చాడు. ఏం చేయగలడు. ఏమనగలడు.

'పడుకో వెళ్ళి' అన్నట్టు చెయ్యూపాడు.

దృష్టి సూటిగా లాంతరువైపు కేంద్రీకృతమైంది.

ఏదో చేయాలి....ఏం చేయాలి...?

ఈ ప్రశ్నతోనే తన ఇరవయ్యేడేళ్ళు గడిచిపోయినయ్!



ఏంచేయాలి.... యస్.... కమాన్.... స్పీకప్.... మనసు రొదపెడ్తోంది. తరాల్నించీ రకంలో రిఫ్లెక్స్ అయిన ఒక్కొక్క ఊహ భస్మీపటలమై పోతోంది..కమాన్.. యెవణ్ణయినా దోచెయ్ ఆడబ్బుతో నీ చెల్లి పెళ్ళి చేసెయ్....ఎవరింటికన్నా కన్నం వెయ్....ఏ మాంగల్యాన్నన్నా తెంపెయ్.. నువు సుఖపడు.... అటా....యిటా.... అటాయిటా... కాంప్లెక్స్... అడుగడుక్కీ రక్తానికీ. మస్తిష్కానికీ మధ్య కోల్డ్‌వార్!

మొన్నెవరో అడిగారు. "మీ పిలాడికి మా అమ్మాయి నిద్దాం. కానీ ఉద్యోగమే లేదాయె బియ్యే చదివినా"

యస్....అదే....అటు యెగబాకే అవకాశం యివ్వకా, యిటు దిగజారే ధైర్యాన్నీ యివ్వలేక త్రిశంకుస్వర్గంలా ఫాల్స్ ప్రిస్టేజీని రక్తంలోని అణువణువులోనూ రెచ్చగొడుతోంది.... యస్.... దట్సిట్.... ఐడియా.... కమాన్....క్విక్.

లేచి ట్రంకు పెట్టెలోంచి సర్టిఫికెట్సన్నీ తీసి లాంతరు దగ్గరకెళ్ళి ఒక్కొక్కటీ కసిగా చించి అంటిస్తున్నాడు.

మంట చప్పుడుకు తల్లి లేచింది.

లేచున్న చెల్లాయ్ మరింత బిగదీసుకుంది.

ఆఖర్న డిగ్రీ కాగితాన్ని అంటించాడు.

ఆవురావురుమంటూ డిగ్రీ కాలిపోతోంది భగభగా.

'ఏంటి రాజూ ఏమిట్రా యిది.సిగ్గానీ.' ఆపబోయింది

"కాలిపోతోందమ్మా.... అహం....అభిమానం....ప్రిస్టేజీ.... అన్నీ కాలి దగ్ధమైపోతున్నాయి...." ఒక్కొక్క మాటా వత్తివత్తి పలికాడు.

వెర్రిదానిలా చూస్తుండిపోయింది తల్లి.

కాలుతున్న డిగ్రీ వెలుగులో రాజు కళ్ళు విస్ఫులింగాలా మండుతున్నాయ్. మండిపోయిన కాగితపు ముక్కల్ని గాల్లోకి లేపుతూ నిటారుగా నిలబడ్డాడు.... నల్లని పొడి ముక్కలు ముక్కలుగా రాలిపోయింది. వెలిగిన వెలుగారిపోయింది.

నిశ్శబ్దంలో....నిశీధిలో.... నీరవంలో తల్లి గొంతు వణికింది.

"బాబూ—"

తల్లి పిలుపుకి తీక్షణంగా చూస్తూ తలెత్తాడు రాజు.

ఏ సూర్యుడూ ఉదయించని ఆ నిశి రాత్రిలో....ఆ కళ్ళలో కోటి సూర్యుళ్ళ జ్వాల వొక్కసారిగా భగ్గుమంది!

పుడమితలి వణికిపోతూంది. తనపై భారంగా చీల్చేస్తూ పడుతూన్న అడుగులు..

అగమ్యంగా.... అనంతంలోకి.... దూసుకుపోతున్నయ్! ★